

పెద్ద పులులు @ 9
కొల్లాపూర్ అటవీ రేంజ్ పరిధిలో క్రమంగా పెద్ద పులుల సంతతి పెరుగుతోంది.

వివరాలు 10లో ▸



తెరపైకి రింగ్‌రోడ్డు
జడ్చర్లలో ట్రాఫిక్ సమస్యను తీర్చేందుకు రింగ్ రోడ్డు తెరపైకి వచ్చింది.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.9 /22.8

వాతావరణం
రోజంతా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమవుతుంది. సాయంత్రం చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

బీచుపల్లిలో 15నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో ఈ నెల 15 నుంచి 23 వరకు శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది రోజుల పాటు సరస్వతిదేవి వివిధ అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. వైభవంగా జరిగే ఇట్టి ఉత్సవాలకు చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు పీఈటీ ఎంపిక



గద్వాల రూరల్: ధరూరు మండలంలోని రేవులపల్లి ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రజనీకాంత్ సివిల్ సరీ్వసెస్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 16 నుండి 20వ తేదీ వరకు న్యూఢిల్లీలోని త్యాగరాజ్ స్టేడియంలో జరిగే పోటీల్లో ఆయన పాల్గొననున్నారు. ఇదిలా ఉండగా.. ఆగస్టు 1, 2వ తేదీలలో హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో రాష్ట్ర స్థాయి సెలక్షన్స్ జరగగా.. అందులో ప్రతిభ కనబరిచి రాష్ట్రం తరపున జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఎంపికైన రజనీకాంత్‌ను డీఈఓ సిరాజుద్దీన్, డీవైఎస్ఓ డా. బీఎస్ ఆనంద్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ జితేందర్, రేవులపల్లి గజిటెడ్ హెడ్మాస్టర్ రవీంద్రబాబు, కృష్ణయ్య అభినందించారు.

112 మంది ధ్రువపత్రాల పరిశీలన

గద్వాల క్రైం: కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన గురువారం ఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాలను సిబ్బంది బార్ కోడ్ ద్వారా నిర్ధారించారు. 117 మంది అభ్యర్థులకు గాను 112 మంది అభ్యర్థులు హాజరయ్యారు. శుక్రవారం సైతం ఈ కార్యక్రమం కొనసాగుతుందని, హాజరు కాని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన పేర్కొన్నారు.

‘కూత’కు సిద్ధం..!



ఎన్నికల దృష్ట్యా కొత్తగా తెచ్చిన స్పీకర్లను సిద్ధం చేస్తున్న సౌండ్ సిస్టం వ్యాపారులు

ఎన్నికల దృష్ట్యా జిల్లాలో పుంజుకోనున్న వ్యాపారాలు
- ఫ్లెక్సీలు మొదలు క్యాటరింగ్ సర్వీస్‌ల వరకు
- వంట మాస్టర్లు.. డ్రైవర్లకు చేతి నిండా పని
- పరికరాలను సిద్ధం చేసుకునే పనిలో సప్లయర్స్ వ్యాపారులు

రాజోళి: అటు ఎన్నికల నగారా మోగిందో లేదో రాజకీయ పార్టీల నాయకులు, అధికారులే కాదు.. ఇటు బ్యానర్ల ప్రింటింగ్ మొదలు.. వాటిని కట్టే వారి నుంచి ప్రచార రథాలు నడిపే డ్రైవర్లు.. వంట మాస్టర్లు.. క్యాటరింగ్‌లు.. హోటళ్లు.. సప్లయర్స్.. ఇలా ప్రతి ఒక్క వ్యాపారం జోరందుకోనుంది. దాదాపు రెండు నెలల పాటు తమ వ్యాపారాలు ఎంచక్కా సాగుతాయనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుండే ఆయా రంగాలకు చెందిన వ్యాపారులు అన్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో జోరుగా పోటీ జరుగుతుందనే ప్రచారం నేపథ్యంలో వ్యాపారులు కూడా దానికి తగ్గట్టుగానే ముందుకు సాగుతున్నారు.

సప్లయర్స్ బిజీ బిజీ
సప్లయర్స్ వ్యాపారులకు ఇప్పటి నుండే అడ్వాన్సులు అందుతున్నాయి. టెంట్లు, వంట పాత్రలు, లైటింగ్, కుర్చీలు, మైక్ సెట్లు, స్పీకర్‌లు ఎన్నికలకు ప్రధాన అవసరం కావడంతో చివరిదశలో వాటికి కొరత ఏర్పడే అవకాశం ఉండటంతో, పార్టీల వారు ఇప్పటి నుండే అడ్వాన్సులు ఇస్తున్నారు. దీంతో ఆ వ్యాపారులు కావాల్సిన సామగ్రిని ఇతర ప్రాంతాల నుండి తెచ్చుకుంటున్నారు. మరికొందరు ప్రత్యేకంగా సౌండ్ సిస్టంకు సంబంధించిన షాపులను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో వారికి కూడా ఆర్డర్లు మొదలయ్యాయి. పెట్రోల్ బంకుల్లో కూడా అభ్యర్థుల ప్రచారంలో తిరిగే వాహనాలకు డీజిల్ పోసే విధంగా ముందుగానే మాట్లాడుకుని అడ్వాన్సులు ఇస్తున్నారు.



చేతి నిండా పని..
ప్రస్తుతం ఎన్నికల ప్రచారం కూడా చేసుకునే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించడంతో, ఇప్పటి నుండే పలువురికి చేతి నిండా పని దొరికింది. డ్రైవర్లు అభ్యర్థుల వెంట ప్రచారానికి వెళ్లే వాహనాలకు పనిలోకి వెళ్లేందుకు క్యూ కడుతున్నారు. వాహనాలు ఉన్న వారు తమ వాహనాలను ఎన్నికలు ముగిసే వరకు అద్దెకు పెట్టేందుకు ఆయా పార్టీల వారితో చర్చలు చేస్తున్నారు. వీరితో పాటు వంట మాస్టర్లకు మంచి డిమాండ్ పెరిగింది. అభ్యర్థుల, పార్టీ క్యాంపు కార్యాలయాల వద్ద వంటలు చేసేందుకు, మాస్టర్లను, వారికి సహాయకులను ప్యాకేజీ రూపంలో మాట్లాడుకుంటున్నారు. మొత్తంగా రూ.కోట్లల్లో వ్యాపారాలు జరిగే అవకాశాలున్నాయని పలువురు అంచనా వేస్తున్నారు. ఇలా ఎన్నికల పండగ రావడంతో అభ్యర్థుల మైకులే కాదు, అధికారుల కోడ్, వ్యాపారం కూడా బాగానే కూయనుంది.

ప్రధాన వ్యాపారాలివే..
ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పలు వ్యాపారాలకు ప్రధానంగా డిమాండ్ ఉంది. ఫ్లెక్సీలు తయారు చేయడంలో ఫొటో డిజిటల్‌కు సంబంధించిన వారికి మంచి డిమాండ్ పెరిగింది. అభ్యర్థులు ఎవరైనా ప్రధానంగా ఫ్లెక్సీలను ఎక్కువగా తమ ప్రచారంలో వాడుతుంటారు. దీని కోసం విభిన్నమైన డిజైన్లను తయారుచేసే పనిలో డిజిటల్ వ్యాపారులు మునిగిపోయారు. ఇక ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేందుకు ఆయా వ్యక్తులకు ముందుగానే కాంట్రాక్టు అప్పగించేస్తున్నారు. దీంతో పాటు క్యాటరింగ్ వారికి కూడా మంచి డిమాండ్ పెరిగింది. అభ్యర్థుల ప్రచారంలో భాగంగా రోజూ ఉదయం నుంచి రాత్రి వరకు వెంట తిరిగే కార్యకర్తలు, నాయకులు సమావేశాలకు వచ్చే వారికి టిఫిన్లు, భోజనాలు అందించేందుకు, ఆ అదనపు భారం తమపై పడకుండా ముందుగానే క్యాటరింగ్‌లకే అప్పజెబుతుండటంతో ఆ రంగంలో ఉన్న వారు ఆర్డర్లకు సరిపడా వంట సామగ్రి, కిరాణ సామాను, గ్యాస్ ఏర్పాటు చేసుకుంటున్నారు. కొన్ని పార్టీల వారు మాత్రం భోజనాలు ఇతర ప్రత్యేకమైన వంటకాల ద్వారా ఆకర్షించే విధంగా ప్రణాళిక చేస్తుండటంతో దానికి తగ్గట్టుగానే క్యాటరింగ్ చేసేవారు మెనూ సిద్ధం చేస్తున్నారు.

వాహనాలు, డ్రైవర్లు కీలకం



ఎన్నికలు అంటేనే ప్రచారం. ప్రచారం అంటేనే తప్పనిసరి వాహనాలు కావాలి. గత ఎన్నికల్లో మా దగ్గర ఉన్న తుఫాన్లు, కార్లు, ఇతర వాహనాలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా అద్దెకు తీసుకువచ్చాం. డ్రైవర్లకు కూడా చాలా పని ఉంటుంది. కొందరు రోజు మాదిరిగా డ్యూటీ చేస్తే, మరి కొందరికి వాహనం,డ్రైవర్ కలిపి ప్యాకేజీగా మాట్లాడతాం. – రమేష్, ట్రావెల్స్ వ్యాపారి

సౌండ్ సిస్టం ఏర్పాటు చేశాం



ప్రత్యేకంగా సౌండ్ సిస్టం మాత్రమే ఏర్పాటు చేశాం. గత నెలలోనే షాపు ఏర్పాటు చేశాం. త్వరలో ఎన్నికలు రాబోతున్నాయి. వారి నుండి ఇప్పటికే ఆర్డర్లు మొదలవుతున్నాయి. మరో పది రోజుల్లో ఇంకా ఎక్కువగా ఆర్డర్లు వస్తాయని అనుకుంటున్నాం. – పరుశరామ్, సౌండ్ సిస్టం, వ్యాపారి

ఫ్లెక్సీలకు మంచి ఆర్డర్లు



గడిచిన ఎన్నికల్లో అభ్యర్థులు, ఆయా పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు భారీగానే ఏర్పాటు చేశాం. నెల ముందు నుండే వ్యాపారం బాగా నడిచింది. ప్రస్తుతం కూడా ఫ్లెక్సీలకు సంబంధించి గ్రామ, మండల స్థాయి నాయకుల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. – రాజశేఖర్, డిజిటల్ ఫొటో వ్యాపారి

వంటలు చేసేందుకు పిలుస్తున్నారు



ఎన్నికలు వస్తుండంతో రాజకీయ పార్టీ నాయకులకు వంట చేసేందుకు ఆర్డర్లు వస్తున్నాయి. ఉదయం టిఫిన్ నుండి మొదలుకుని, రాత్రి వరకు, కూరగాయాలు, చికెన్, మటన్‌లాంటి వంట చేయాల్సి ఉంటుంది. గతంలో పలు పార్టీల వారికి చేశాం, ప్రస్తుతం కొందరు నాయకులు వచ్చి తమకు వంట చేయాలని అంటున్నారు. ఈ రెండు నెలలు చేతి నిండా పని ఉంటుందనుకుంటున్నాం. – ఆంజనేయులు, వంట మాస్టర్

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు



ఎన్నికల నియమావళిని అధికారులకు వివరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

- స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి
- సమస్యాత్మక కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: జిల్లాలో జరిగే శాసనసభ ఎన్నికలకు సంబంధించి పారదర్శకంగా, స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులందరు నిబద్ధతతో పని చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలోని సమావేశం హాల్లో ఎన్నికల నోడల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, గణాంక, దృష్ట్యా మాధ్యమ బృందాలతో సమావేశం నిర్వహించి ప్రొజెక్టర్ ద్వారా ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ ఈనెల 9న విడుదలైందని, ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 5వ తేదీ వరకు ఎన్నికల కోడ్, నియమ నిబంధనలను అమల్లోకి వచ్చాయన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలెన్స్, నిబంధనలను, బాధ్యతలు, విధుల గురించి వివరించారు. ఎన్నికల కోడ్ అందరికి కూడ సమానంగా వర్తిస్తుందని, జిల్లా వ్యాప్తంగా 4 ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు 24గంటల పాటు పర్యవేక్షిస్తుంటాయన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, అక్రమంగా డబ్బు, మద్యం, బహుమతులను సంబంధించి వాటిపై నిఘా ఉంచామన్నారు. సీ విజిల్ యాప్, కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం కానీ, టోల్ ఫ్రీ నెం .1950 నంబర్‌కు ఎన్నికల ఉల్లంఘనకు సంబంధించి కానీ, ఇతర ఫిర్యాదు వస్తే 15నిమిషాల్లోనే సంఘటన స్థలానికి చేరుకొని స్పందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

బాధ్యతగా పనిచేయాలి
ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు బాధ్యతతో పని చేయాలని, వాటికి సంబంధించి అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ సమావేశం హాల్‌లో నోడల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్విలెయన్స్, వీడియో వింగ్ సర్వెలెన్స్ బృందాలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రతి ఒక్కరికి సమానంగా వర్తిస్తాయని, జిల్లాలో 4ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 24గంటలు పర్యవేక్షణలు చేస్తుంటాయని తెలిపారు. నవంబర్ 28న సాయంత్రం 5గంటలోపు ప్రచారం నిలిపివేయాలని, ప్రతి అభ్యర్థి నామినేషన్ నుండి ఫలితాల వరకు చేసిన ఖర్చు వివరాలను 30రోజుల్లో జిల్లా ఎన్నికల అధికారికి అందజేయాలన్నారు. జిల్లాలో అక్రమంగా డబ్బు, మద్యం సరఫరా, ప్రలోభాలు, బహుమతులు వంటి వాటిని పకడ్బందీగా నియంత్రించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా సమస్యలు ఉంటే సీవిజిల్ యాప్, టోల్‌ఫ్రీనెం.1950 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చీర్ల శ్రీనివాసులు, అపూర్వ్ చౌహాన్, ఆర్డీఓ చంద్రకళ, నోడల్ అధికారులు, సెక్టోరియల్ అధికారులు, పోలీస్ యంత్రాంగం తదితరులు ఉన్నారు.

నాయకుల ఖర్చుపై నిఘా
ఎన్నికలలో వివిధ రాజకీయ పార్టీలు చేసే వ్యయంపై ప్రత్యేక నిఘా ఉంచి ఎప్పటికప్పుడు వివరాలను నమోదు చేయాలన్నారు. పోలింగ్ 48గంటల ముందు రాజకీయ పార్టీలు ఎలాంటి ప్రచారం నిర్వహించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా రూ.50వేల నగదుకు మించి సమగ్ర ఆధారాలు లేకుండా రవాణా చేస్తున్నట్లయితే వెంటనే డబ్బును సీజ్ చేయాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, భయభ్రాంతులకు గురి చేయడం వంటి చర్యలకు పాల్పడితే సదరు వ్యక్తులు, రాజకీయ పార్టీలపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా కఠినంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో ఇంచార్జ్ ఎస్పీ రవి, అదనపు కలెక్టర్లు చీర్ల శ్రీనివాసులు, అపూర్వ్ చౌహాన్, ఆర్డీఓ చంద్రకళ, నోడల్ అధికారులు, సెక్టోరియల్ అధికారులు, పోలీస్ యంత్రాంగం తదితరులు ఉన్నారు.

బకాయిలు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి




సీఈఓ లక్ష్మయ్యకు వినతిపత్రం అందిస్తున్న శ్రీధర్‌రెడ్డి తదితరులు

మానవపాడు: సహకార సంఘం బలమైనదని, పెండింగ్ బకాయిలు త్వరగా చెల్లించాలని, తాతల కాలం నుంచి తీసుకున్న రుణాలు చెల్లించకుంటే వారి మనవళ్లతో వసూలు చేస్తామని సీఈఓ లక్ష్మయ్య అన్నారు. గురువారం మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నందు పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్‌బీఐ కంటే సహకార సంఘ బ్యాంక్‌లలో రైతులకు తక్కువ వడ్డీతో రైతులకు రుణాలు అందిస్తామని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. రైతుల నుంచి రూ.46లక్షల ఆదాయం పొందిన సహకార సంఘాన్ని ఆయన అభినందించారు. ఇంకా పాత బకాయిలు చెల్లించాలని తెలిపారు. 20 సంవత్సరాల కాలంగా పెండింగ్‌లో ఉన్న రుణం వసూలు చేసి సహకార సంఘ అభివృద్ధికి, ఇతర రైతులకు రుణాలు అందించడానికి ఉపయోగపడ్డ పాలక సభ్యులను అభినందించారు. అదేవిధంగా ఆ రుణాలకు సంబందించి వేలం పాట నిర్వహించి వేలం దక్కించుకున్న రైతుకు రిజిస్ట్రేషన్ చేయించామన్నారు. దీర్ఘకాలిక రుణాలు 50 మందికే కాదు, 100 మంది రైతులకు రుణాలు అందిస్తామని తెలిపారు. ఎప్పటికప్పుడు రుణాల చెల్లిస్తూ సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక రుణాలకు సంబందించి నాలుగు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మానవపాడు సహకార సంఘానికి రూ. కోటి స్వల్పకాలిక రుణాలు అందించాలని సీఈఓ లక్ష్మయ్యకు పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సభ్యులు అందించారు. కార్యక్రమంలో డీఆర్ కోదండరాములు, శాంతినగర్ బ్యాంక్ మేనేజర్ జితేందర్, అశోక్ కుమార్, ఉపాధ్యక్షులు అయ్యన్న, డైరెక్టర్ కృష్ణగౌడ్, సీఈఓ మద్దిలేటి, స్టాఫ్ అసిస్టెంట్ ప్రభాకర్‌నాయుడు పాల్గొన్నారు.

‘పాలమూరు’ @రాజకీయం..!

ఉమ్మడి మహబూబ్‌నగర్‌పైనే ప్రధాన పార్టీల నజర్
- పీఆర్‌ఎల్‌ఐఎస్ ప్రారంభంతో ప్రచారానికి తెరలేపిన బీఆర్‌ఎస్
- నామినేషన్ల ఘట్టానికి ముందే ఉమ్మడి జిల్లాను చుట్టేసేలా కేసీఆర్ కార్యాచరణ
- ఇక్కడి నుంచే ఎన్నికల శంఖారావం పూరించిన బీజేపీ
- జోడో, పీపుల్స్ మార్చ్ యాత్రలతో కన్నేసిన కాంగ్రెస్
- అలంపూర్ నుంచి బస్సుయాత్ర చేపట్టాలని హస్తం యోచన



సాక్షిప్రతినిధి, మహబూబ్‌నగర్: రాజకీయ సమీకరణలకు కేరాఫ్‌గా నిలిచే పాలమూరుపైనే ప్రాధాన రాజకీయ పార్టీలు కన్నేశాయి. ఎన్నికలకు గడువు సమీపిస్తున్న వేళ మరింత క్రియాశీలకంగా రంగంలోకి దిగుతున్నాయి. దక్షిణ తెలంగాణలో పాగా వేయాలంటే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లానే కీలకమని భావించిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ.. ఇందుకనుగుణంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నాయి.

పీఆర్‌ఎల్‌ఐఎస్‌తో షురూ..
తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 14 స్థానాలకు బీఆర్‌ఎస్ ఏడు, కాంగ్రెస్ ఐదు, టీడీపీ రెండు స్థానాల్లో గెలుపొందిన విషయం తెలిసిందే. ఆ తర్వాత పరిణామాల క్రమంలో నారాయణపేట నియోజకవర్గంలో టీడీపీ నుంచి గెలిచిన రాజేందర్‌రెడ్డి, మక్తల్‌లో కాంగ్రెస్ నుంచి విజయం సాధించిన చిట్టెం రామ్మోహన్ రెడ్డి కారెక్కారు. అనంతరం 2018లో జరిగిన ఎన్నికల్లో 13 స్థానాలను బీఆర్‌ఎస్ కైవసం చేసుకుంది. కొల్లాపూర్‌లో కాంగ్రెస్ నుంచి ఒకే ఒక్కడు బీరం హర్షవర్ధన్‌రెడ్డి గెలుపొందినా.. ఆయన సైతం గులాబీ చెంతన చేరారు. ఈ గణాంకాలు బీఆర్‌ఎస్ ఆధిక్యతకు నిదర్శనంగా నిలుస్తుండగా.. ఆధిక్యాన్ని నిలుపుకునేందుకు ఆ పార్టీ పాలమూరునే ఎంచుకుంది.

కాంగ్రెస్ బస్సు యాత్ర
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇప్పటికే పాలమూరులో భారత్ జోడో యాత్ర నిర్వహించారు. వివిధ నియోజకవర్గాల గుండా సాగిన పాదయాత్రతో ఆయన ప్రజలతో మమేకమయ్యారు. అదేవిధంగా సీఎల్పీ నేత భట్టివిక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర పాలమూరు గుండానే కొనసాగింది. ఆ తర్వాత టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, భట్టి తదితర ముఖ్యనేతలు ఉమ్మడి జిల్లాపైనే నజర్ వేసి పలు పర్యాయాలు పర్యటించారు. తాజాగా వారంలో అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గే తదితర స్టార్ క్యాంపెయినర్లతో రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టేందుకు సన్నద్ధమవుతున్న హస్తం నేతలు జోగుళాంబ అమ్మవారి సాక్షిగా అలంపూర్ నుంచి కొనసాగించేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

కమలదళం సైతం..
ప్రజా సంగ్రామ యాత్ర రెండో విడత పాలమూరులోని జోగుళాంబ సాక్షిగా బీజేపీ అప్పటి రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ ప్రారంభించిన విషయం తెలిసిందే. పలు నియోజకవర్గాల గుండా సాగిన యాత్ర ఆ పార్టీలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. అప్పటి నుంచి బీజేపీ ముఖ్యనేతలు క్రమం తప్పకుండా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పర్యటించారు. మరోవైపు సాక్షాత్తు దేశ ప్రధాని నరేంద్ర మోదీ పాలమూరులో భారీ బహిరంగసభను నిర్వహించడం ద్వారా అసెంబ్లీ ఎన్నికల శంఖరావాన్ని పూరించారు. ఇప్పటి వరకు ఆ పార్టీ అభ్యర్థులను ఖరారు చేయనప్పటికీ.. జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి నిత్యం వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ శ్రేణుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారు. మొత్తానికి ఈ ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీలలు ప్రత్యేక దృష్టి సారించడం వెనుక బృహత్తర ప్రణాళిక ఉందని.. దక్షిణ తెలంగాణలో పాగా వేసేలా ముందుకు సాగుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ సమయంలో ఉమ్మడి పాలమూరు ఎంపీగా ఉన్న సీఎం కేసీఆర్ మొదట తన ఉద్యమ ప్రస్థానాన్ని సైతం ఆర్డీఎస్ ప్రాజెక్టును ఆధారంగానే చేసుకుని మొదలుపెట్టిన విషయం విధితమే. దీంతో రెండు పర్యాయాలు కూడా ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎక్కువ అసెంబ్లీ స్థానాల్లో పర్యటిస్తూ ప్రజలను తమవైపు తిప్పుకుని విజయం సాధించారు. తాజాగా మరోమారు కేసీఆర్ ఉమ్మడి జిల్లాపైనే స్పెషల్ ఫోకస్ పెట్టినట్లు ఆయన ఎన్నికల టూర్ షెడ్యూల్‌ను బట్టి తెలుస్తోంది.

తాజాగా సుడిగాలి పర్యటనలతో..
నవంబర్ 3న ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుండగా.. అదే రోజు నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. పదో తేదీన నామినేషన్లకు తుది గడువు కాగా.. సీఎం కేసీఆర్ 9వ తేదీన గజ్వేల్, కామారెడ్డిలో నామినేషన్లు దాఖలు చేయనున్నారు. అంతలోపే ఆయన ఉమ్మడి పాలమూరులోని ఆరు నియోజకవర్గాలను చుట్టేయనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ సైతం ఖరారైంది. ఈనెల 18న జడ్చర్ల, 26న అచ్చంపేట, నాగర్‌కర్నూల్, నవంబర్ 6న గద్వాల, మక్తల్, నారాయణపేట నియోజకవర్గాల్లో నిర్వహించనున్న బహిరంగసభల్లో పాల్గొననున్నారు. ఇప్పటికే అన్ని పార్టీల కంటే అసెంబ్లీ అభ్యర్థులను ముందస్తుగా ప్రకటించిన సీఎం.. తాజాగా అందరి కంటే ముందుగానే పర్యటనలకు శ్రీకారం చుట్టడంతో ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది.

ఈ నేపథ్యంలోనే బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఉమ్మడి పాలమూరుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా కొల్లాపూర్‌లో మొదటి పంప్‌ను ప్రారంభించిన ఆయన.. పరోక్షంగా ఎన్నికల ప్రచారాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించారు.

బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్‌ల నియామకం

పాలమూరు: అసెంబ్లీ ఎన్నికల తేదీల ప్రకటనతో బీఆర్‌ఎస్ పార్టీ సన్నద్ధత చర్యలను ముమ్మరం చేసింది. ఇది వరకే అన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన గులాబీ పార్టీ.. తాజాగా గురువారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాలకు క్యాంపెయిన్ ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఇందులో నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గానికి సంబంధించి తెలంగాణ క్రీడాప్రాధికారిక సంస్థ చైర్మన్ ఆంజనేయులు గౌడ్, గద్వాలకు కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాకేష్ చిరుమళ్ల, అలంపూర్‌కు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అచ్చంపేటకు మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, కల్వకుర్తికి ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డిలను నియమించారు.

క్లుప్తంగా

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి

గోపాల్‌పేట: బైక్‌పై నుంచి కిందపడి మహిళ మృతి చెందిన ఘటన గొల్లపల్లిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. రేవల్లి ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాల మేరకు.. రేవల్లి మండలంలోని గొల్లపల్లి చెందిన కురువమ్మ (48), భర్త ఎల్లయ్య బుధవారం బంధువు అంత్యక్రియలకు నాగసూలు వెళ్లారు. అనంతరం బైకుపై ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. కొంకలపల్లి సమీపంలోని బ్రిడ్జి వద్ద కురువమ్మ బైకుపై నుంచి కిందపడిపోయింది. వెంటనే ఆమెను నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. బుధవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. కుమారుడు బంకల మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేఎల్‌ఐ కాల్వలో పడి వృద్ధురాలు..

మిడ్జిల్: మండలంలోని చిల్వేర్ సమీపంలో గల కేఎల్‌ఐ కాల్వలో పడి ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు, గ్రామస్తుల వివరాల మేరకు.. చిల్వేర్‌కు చెందిన దేవీబాయి (62) మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం సాయంత్రం గ్రామ సమీపంలోని కేఎల్‌ఐ కాల్వలో మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని వెలికితీయగా, దేవీబాయిగా గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం

వెల్దండ: మండలంలోని భర్కత్‌పల్లిలో బొజ్జయ్య(50) గురువారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘటనా స్థలానికి పోలీసు చేరుకుని పరిశీలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజోళి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ ఖాదర్ భాషా తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఇటిక్యాల మండలం వావిలాలకు చెందిన సంజన్న(51) బుధవారం రాజోళిలో బైక్‌పై వెళ్తూ పత్తి లారీ ఢీకొట్టడంతో గాయాలపాలయ్యారు. చికిత్స నిమిత్తం కర్నూల్ ఆస్పత్రికి తరలించగా, గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

వెల్దండ: మండలంలోని రాఘయపల్లి గేట్ వద్ద ఉన్న అభిష్ట హోటల్ యజమాని వినయ్‌ని గుర్తు తెలియని వ్యక్తులు ఆన్‌లైన్ ద్వారా తన ఖాతా నుంచి నగదు డ్రా చేశారు. వివరాలు ఇలా.. బుధవారం వినయ్‌కు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి ఆర్మీలో పనిచేస్తామని తమకు భోజనం కావాలని ఆర్డర్ ఇవ్వడంతో వారు ప్యాకింగ్ చేసి రూ.6,300 బిల్లు అయినట్లు తెలిపారు. వారు ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపిస్తామని ఫోన్‌పే నెంబర్ చెప్పాలన్నారు. వినయ్ ఫోన్ పే నంబర్ చెప్పడంతో వారు ఓటీపీ చెప్పాలన్నారు. వారి మాటలు నమ్మిన వినయ్ ఓటీపీ చెప్పడంతో ఖాతా నుంచి రూ.24వేలు డ్రా అయ్యినట్లు మెసేజ్ వచ్చింది. గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో లోన్ వస్తుందని..

చారకొండ: ఆన్‌లైన్‌లో లోన్ వస్తుందని ఆశపడి యువకుడు డబ్బులు పోగొట్టుకున్న ఘటన మండలంలోని గోకారంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవి తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని గోకారం చెందిన జమ్ముల రామకృష్ణకు ఈనెల 6వ తేదీన మధ్యాహ్నం ఫోన్ చేసి ఇండియా బుల్స్ కంపెనీ నుంచి మాట్లాడుతున్నాం.. మీకు రూ.1.25లక్షల లోన్ మంజూరు అయ్యిందని తెలిపారు. అందుకు ప్రాసెసింగ్ ఫీజు రూ.3,500 చెల్లించాలని చెప్పడంతో బాధితుడు ఫోన్‌పే ద్వారా పంపాడు. మరలా ఈఎంఐ, జీఎస్టీ వివిధ కారణాలతో 15 సార్లు మొత్తం రూ.30,275 చెల్లించాడు. తనకు ఎలాంటి లోన్ రాకపోవడంతో గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

పార్ట్‌టైం జాబ్ పేరుతో..

అచ్చంపేట రూరల్: పట్టణానికి చెందిన గృహిణికి పార్ట్‌టైం జాబ్ ఉందని, తక్కువ పెట్టుబడితో డబుల్ డబ్బులు సంపాదించవచ్చని మొబైకు ఓ మెసేజ్ వచ్చింది. నమ్మిన గృహిణి మొదట కొంత డబ్బులు వారు పంపిన లింకు ద్వారా పంపింది. ఆ డబ్బులకు డబుల్ వచ్చాయి. ఇలా కొన్ని పర్యాయాలు వచ్చాక తిరిగి తన బ్యాంకు ఖాతాను చూసుకోగా రూ.82వేలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. మోసపోయానని గ్రహించి గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

పెద్ద పులులు @9

- కొల్లాపూర్ అటవీ రేంజ్‌లో పెరుగుతున్న పులుల సంతతి
- ఆవాసయోగ్యంగా మారిన నల్లమల అటవీ ప్రాంతం
- అనుమతులు లేకుండా అడవుల్లోకి వెళ్లొద్దని అధికారుల సూచన
- పర్యాటకుల కోసం వ్యూపాయింట్ ఏర్పాటుకు చర్యలు



కొల్లాపూర్ అటవీ రేంజ్ పరిధిలో సంచరిస్తున్న పెద్దపులులు



కొల్లాపూర్: నల్లమల అభయారణ్యం పులులకు ఆవాసయోగ్యంగా మారుతోంది. కొల్లాపూర్ అటవీ రేంజ్ పరిధిలో క్రమంగా పులుల సంతతి పెరుగుతూ వస్తోంది. మూడేళ్ల క్రితం వరకు మూడు పెద్దపులులు మాత్రమే ఉండగా.. ఇటీవల వాటి సంఖ్య తొమ్మిదికి చేరింది. పులుల సంచారానికి సంబంధించిన వీడియో ఫుటేజీలను రెగ్యులర్‌గా అటవీశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో 32,810 హెక్టార్ల విస్తీర్ణంలో నల్లమల అటవీ ప్రాంతం ఉంది. ఈ ప్రాంతంలో పెద్ద పులులు కనుమరుగై పోయాయి అనుకున్న దశలో కొన్నేళ్ల నుంచి మళ్లీ వాటి కదలికలు ప్రారంభమయ్యాయి. నల్లమల అడవులను టైగర్ జోన్‌గా గుర్తించి, పులులకు అవసరమైన వసతులను కల్పించేందుకు అటవీశాఖ చర్యలు చేపట్టింది. మూడేళ్ల క్రితం వరకు కొల్లాపూర్ అటవీ రేంజ్ పరిధిలో కేవలం మూడు పెద్దపులు మాత్రమే సంచరించినట్లు అధికారులు ప్రకటించారు. వీటిలో ఒక మగ పులి, రెండు ఆడపులులు ఉన్నాయి. అయితే ఇటీవలి కాలంలో వాటికి సంతానోత్పత్తి కలగడంతో పులుల సంఖ్య తొమ్మిదికి చేరింది. ప్రస్తుతం కొల్లాపూర్ అటవీ రేంజ్‌లో మూడు మగ పులులు, ఆరు ఆడపులులు ఉన్నట్లు గుర్తించారు. సెప్టెంబర్ 30న అటవీ ప్రాంతంలో అమర్చిన సీసీ కెమెరాల్లో వీటి కదలికలను గుర్తించారు. వీటిలో మూడు పెద్దపులులతోపాటు రెండేళ్ల వయస్సు గల పులులు నాలుగు, ఏడాది వయస్సు గల పులులు రెండు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

పెరుగుతున్న చిరుతల సంఖ్య..

కొల్లాపూర్ అటవీ రేంజ్ పరిధిలో చిరుత పులుల సంఖ్య కూడా భారీగా పెరుగుతోంది. రేంజ్ పరిధిలో 25 వరకు చిరుతలు ఉన్నాయని ఫారెస్ట్ అధికారులు వెల్లడించారు. వన్యప్రాణుల సంచారాన్ని గుర్తించేందుకోసం 40కి పైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అంకలిపెంట, ముద్దునూటి పెంట, పెగ్గర్లపెంట, ఎర్రపెంట, పెద్దూటి, మినుమూటి పెంట ప్రాంతాల్లో పులుల సంచారం కనిపించినట్లు తెలిపారు. కొల్లాపూర్ సమీపంలోని ఎర్రకుంట ప్రాంతంలో కూడా మూడు చిరుతలు సంచరిస్తున్నట్లు అధికారులు పెగ్ మార్కింగ్ ద్వారా గుర్తించారు. కర్ణాటక అడవుల్లో ఉండే బైసన్ అడవి దున్న ఒకటి కొంతకాలం కొల్లాపూర్ అడవుల్లో తిరిగిందని, ప్రస్తుతం అది అమ్రాబాద్ అడవుల్లోకి వెళ్లిందని పేర్కొంటున్నారు. పులులు, చిరుతలతో పాటు, జింకలు, సాంబార్లు, నీల్‌గయి, కడితి వంటి జంతువులు 500లకు పైగా, ఎలుగు బంట్లు 30 వరకు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

పులులకు ఆవాసయోగ్యం



కొల్లాపూర్ అటవీ రేంజ్ పరిధిలో పెద్దపులులు ఆవాసం ఏర్పాటు చేసుకుంటున్నాయి. పులుల సంతానోత్పత్తికి ఈ ప్రాంతం అనువుగా ఉంది. ప్రస్తుతం మూడు మగ, ఆరు ఆడ పెద్ద పులులు ఉన్నాయి. ఆడ పులులు ఎక్కువగా ఉన్నందున మరో రెండేళ్లలో వీటి సంఖ్య రెట్టింపయ్యే అవకాశం ఉంది. పశువులు, గొర్రెల కాపర్లతోపాటు ఇతరులు ఎవరైనా సరే అనుమతి లేకుండా అడవుల్లోకి ప్రవేశించవద్దు. పర్యాటకులు అటవీ అందాలు తిలకించేందుకు కొల్లాపూర్ సమీపంలో టూరిస్టు పార్కును ఏర్పాటు చేస్తున్నాం. త్వరలోనే దాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం.

– శరత్‌చంద్రారెడ్డి, ఎఫ్ఆర్‌ఓ, కొల్లాపూర్

రూ.1.50 లక్షలతో టూరిస్టు పార్కు..

నల్లమలలో వన్యమృగాల సంఖ్య పెరుగుతుండటంతో అనుమతులు లేకుండా ఎవ్వరు అటవీ ప్రాంతంలోకి ప్రవేశించవద్దని అధికారులు సూచిస్తున్నారు. నల్లమల అందాలు చూడాలనుకునే పర్యాటకుల కోసం కొల్లాపూర్– సోమశిల దారిలో అటవీ టూరిస్టు పార్కు ఏర్పాటు చేస్తున్నారు. హరిత, టీకేహెచ్ఎస్ నిధులు రూ.1.50 లక్షల వ్యయంతో ఈ పార్కును నిర్మిస్తున్నారు. పార్కు ప్రారంభం నుంచి రెండు కిలోమీటర్ల లోపలి వరకు మట్టిరోడ్డు నిర్మించి, అక్కడే ఎత్తయిన కొండపై వ్యూ పాయింట్ నిర్మాణాలు చేపట్టారు. అక్కడి నుంచి చూస్తే సోమశిల గ్రామంతోపాటు కృష్ణానది అందాలు, సప్తనదుల సంగమ ప్రాంతం, నల్లమల కొండలు కనువిందు చేయనున్నాయి. మరో రెండు నెలల్లో వ్యూ పాయింట్‌ను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు.



కొల్లాపూర్ సమీపంలో అటవీశాఖ ఏర్పాటు చేస్తున్న పార్కు

గురుకుల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

లింగాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ వినోద్ ఖన్నాను సస్పెన్షన్ చేస్తూ గురువారం రాష్ట్ర ముఖ్యకార్యదర్శి నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 10న రాత్రి కళాశాల ఆవరణలో జూనియర్ విద్యార్థులపై సీనియర్ల దాడి, 11న బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు కుల సంఘాలతో కలిసి రాస్తారోకో చేసిన విషయం విదితమే. ఈ ఘటనకు ప్రిన్సిపాల్ నిర్లక్ష్యమే కారణంగా గుర్తిస్తూ సస్పెన్షన్ వేటు వేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు వైస్ ప్రిన్సిపాల్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



ఆత్మకూరు మండలం బాలకిష్టాపూర్ సమీపంలో వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

వనపర్తి: జిల్లావ్యాప్తంగా గురువారం సాయంత్రం ఆరు నుంచి అర్ధరాత్రి వరకు నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.4.65 లక్షల నగదు, 150 లీటర్ల మద్యం పట్టుబడింది. పెద్దమందడి మండలం వెల్టూరు స్టేజీ వద్ద రూ.70 వేలు, పెబ్బేరు రంగాపూర్ వద్ద రూ.2 లక్షలు, శ్రీరంగాపురం పీఎస్ పరిధిలో రూ.లక్ష, జిల్లాకేంద్రంలో రూ.95 వేలు పట్టుబడ్డాయని.. ఎలాంటి రసీదులు, లెక్కలు లేకుండా తరలిస్తున్న నగదు, మద్యంను సీజ్ చేసినట్లు ఆయా మండలాల ఎస్‌ఐలు వివరించారు. సీజ్ చేసిన నగదును ఆదాయపన్ను అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ప్రతిరోజూ అన్ని ఠాణాల పరిధిలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు.

తెరపైకి రింగ్‌రోడ్డు



తాటిపర్తి ఆలూరు మీదుగా బూర్గుపల్లి నుంచి జడ్చర్ల–నాగర్‌కర్నూల్ ప్రధాన రోడ్డుపై బూర్గుపల్లి గేట్ వద్ద కలిసే రోడ్డు

ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు కొత్త ప్రతిపాదనలు

- 167, 44 నంబరు జాతీయ రహదారులను కలుపుతూ రోడ్డు
- రోడ్డు నిర్మాణానికి సీఎం ఆమోదం

జడ్చర్ల టౌన్: అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం మున్సిపాలిటీలో ట్రాఫిక్ సమస్య తీర్చేందుకు రింగ్ రోడ్డు ప్రతిపాదనులు తెరపైకి వచ్చాయి. వాస్తవానికి 2016లోనే బైపాస్ నిర్మాణం చేపట్టాలని అధికారులు సర్వే నిర్వహించినప్పటికీ ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి. ఇటీవల అటకెక్కిన బైపాస్ శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైన తర్వాత విషయం చర్చకు వచ్చింది. ఇదే విషయంలో అందరి మదిలో ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి రింగ్‌రోడ్డు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు అంబేద్కర్ కళాభవన్ ప్రారంభం సందర్భంగా ప్రకటించారు. ఆయన ప్రకటనతో రింగ్‌రోడ్డు ఎలా వస్తుందనే చర్చ మొదలైంది.

సీఎం ఆమోదం

ట్రాఫిక్ సమస్య తగ్గించటంతోపాటు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేసే బైపాస్, రింగ్‌రోడ్డు నిర్మాణ ప్రతిపాదనలు సీఎం కేసీఆర్ ఆమోదం తెలిపినట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. సీఎం ఆమోదం తెలియజేయటంతో త్వరలోనే సర్వే నిర్వహించే అవకాశాలున్నాయి. ఇదే జరిగితే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఏర్పడుతుంది.

పరిశీలిస్తున్నాం..

పట్టణంలో ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకు రింగ్‌రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు పరిశీలిస్తున్నాం. ఈ ప్రతిపాదనలను సీఎం కేసీఆర్ ఆమోదం తెలియజేశారు. త్వరలోనే సర్వే నిర్వహించి పనులు ప్రారంభిస్తాం. గతంలో అనుకున్నట్లుగా 44వ నంబరు జాతీయరహదారి దివిటిపల్లి నుంచి బూర్గుపల్లి గేట్ వరకు అటు నుంచి గంగాపురం 167వ నంబరు జాతీయరహదారి కలిపేలా ఒక బైపాస్ నిర్మాణం చేస్తాం. గంగాపురం నుంచి 44వ నంబరు జాతీయరహదారి కలిపేలా రోడ్డు పరిశీలిస్తున్నాం.

– లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

రోడ్డు నిర్మాణం ఇలా..

ముందుగా అనుకున్నట్లుగా 44వ నంబరు జాతీయరహదారి దివిటిపల్లి నుంచి తాటిపర్తి, జడ్చర్ల మండలం ఆలూరు మీదుగా బూర్గుపల్లి నుంచి జడ్చర్ల–నాగర్‌కర్నూలు ప్రధాన రహదారిని బూర్గుపల్లి గేట్ వద్ద కలపనున్నారు. అక్కడి నుంచి చర్లపల్లి మీదుగా గంగాపురం 167వ నంబరు జాతీయరహదారిని కలుపుతారు. ఇక గంగాపురం నుంచి శిఖర్‌గానిపల్లి కావేరమ్మపేట నుంచి 44వ నంబరు జాతీయరహదారి కలుపుతారు. ఇదే మార్గంలో గంగాపురం నుంచి బాలానగర్ వరకు డబుల్‌రోడ్డు వేస్తుండడంతో ఆ రోడ్డును సైతం వినియోగించేలా ప్రతిపాదిస్తున్నారు. ఇక 44వ నంబరు జాతీయరహదారి నుంచి 167వ నంబరు జాతీయరహదారి కలుపుతూ తిరిగి 44వ నంబరు జాతీయరహదారి కలిపే మార్గంపై సర్వే నిర్వహించాల్సి ఉంది. ఇందు కోసం 44వ నంబరు జాతీయరహదారి ప్రభుత్వ గెస్ట్‌హౌస్ పక్క నుంచి బండమీదిపల్లి మీదుగా శంకరాయపల్లి గేట్ వరకు 167వ నంబరు జాతీయహరదారిని కలిపేలా రోడ్డు వేసే అవకాశాలున్నాయి. కొళ్ళగుట్ట వెనక నుంచి 44వ నంబరు జాతీయరహదారి కలిపి తిరిగి దివిటిపల్లి వరకు చేరుకునేలా రోడ్డు నిర్మించే అవకాశాలు ఉన్నాయి. ఇదే జరిగితే నియోజకవర్గ కేంద్రంలో పూర్తిగా ట్రాఫిక్ సమస్య నివారించేందుకు ఆస్కారం కలుగుతుంది. రాయచూర్ నుంచి కోదాడ వెళ్లే వాహనాలు పట్టణంలోని రాకుండా నేరుగా వెళ్లేందుకు వీలు కలుగుతుంది. అలాగే నాగర్‌కర్నూలు, వనపర్తి ప్రాంతాలు వెళ్లే వారు సైతం పట్టణంలోని రాకుండానే వెళ్లగలుగుతారు. ఈ ప్రతిపాదనలు త్వరగా పూర్తిచేసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు. ప్రస్తుతం 167వ నంబరు జాతీయరహదారిపై సిగ్నల్‌గడ్డ వద్ద విస్తరణ పనులు ప్రారంభం అయ్యాయి. పనులు పూర్తి అయ్యేందుకు మరో ఏడాది కాలం పడుతుంది. అప్పటి వరకు ట్రాఫిక్ కష్టాలు వెంటాడుతూనే ఉంటాయి. ఇంకోవైపు పాతబజార్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణం ఇంకో ఐదు నెలల కాలం పడుతుంది. ఇది పూర్తయితే కార్లు, అంబులెన్స్ వంటివాటితోపాటు ద్విచక్రవాహనాలు అటునుంచి వెళ్లటానికి వీలు కలగటంతో సిగ్నల్ గడ్డపై ట్రాఫిక్ సమస్య కొంత తీరుతుంది.

బెల్టుషాపులపై దాడులు: మద్యం స్వాధీనం

ఆత్మకూర్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో మక్తల్ నియోజకవర్గ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం బెల్టుషాపులపై దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. గురువారం ఎఫ్ఎస్‌టీ టీం ఇన్‌చార్జ్ విష్ణుతేజ ఆధ్వర్యంలో మండలంలోని పిన్నంచర్లలో వసంత కిరాణషాపులో రూ.17,980 విలువచేసే, జూరాల గ్రామంలో కావలిరాందాస్ కిరాణషాపులో రూ.11,950, గుంటిపల్లిలో ఎద్దుల ఎల్లన్న ఇంట్లో రూ.7,790 విలువ చేసే మద్యం పట్టుబడిందని వివరించారు. పట్టుబడిన మద్యాన్ని సీజ్‌చేసి ఎఫ్ఎస్‌టీ టీం ఇన్‌చార్జ్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉండవెల్లిలో 21లీటర్లు..

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరులో బెల్ట్ షాపులపై డీటీఎఫ్ అధికారులు ఎస్‌ఐ మొగలప్ప, సిబ్బంది గోవిందు, నవీన్ దాడి చేయగా 21 లీటర్లు మద్యం పట్టుబడినట్లు తెలిపారు. గురువారం పుల్లూరులోని లోకేష్, దీపక్, జయలక్ష్మి, శంకర్ చెందిన బెల్ట్ షాపులలో మద్యం పట్టుబడగా వాటిని సీజ్ చేసి అలంపూర్ ఎక్సైజ్ ఎస్‌ఐ హరికృష్ణకు అప్పగించినట్లు తెలిపారు.

రూ.46,690 విలువ గల మద్యం పట్టివేత..

మక్తల్: మండలంలోని సోమేశ్వర్‌బండలో గురువారం రూ.16,780 విలువ గల మద్యం పట్టుకున్నారు. చిట్యాలలో అంజప్ప వద్ద రూ.29,710 విలువగల మద్యం అధికారులు పట్టుకున్నారు.



ఆత్మకూరులో పట్టుబడిన మద్యాన్నిచూయిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరులో గురువారం ఎస్‌ఐ బాల్‌రాజు ఆధ్వర్యంలో బెల్ట్ షాపులపై దాడులు చేయగా 132 లీటర్ల మద్యం పట్టుబడగా, వీటి విలువ దాదాపు రూ.90 వేలు ఉంటుందని అంచనా వేశారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని నాచహళ్లిలో బెల్టు షాపుపై దాడి చేసి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై గురువారం రూరల్ పోలీసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగన్న తెలిపారు. గ్రామానికి సురేష్ అక్రమంగా మద్యం అమ్ముతుండగా 33 లిక్కర్, 18 బీర్లు దొరికినట్లు తెలిపారు.

చిన్నారుల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి

మల్దకల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఎదుగుదలపై అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా సంక్షేమ అధికారి ముసాయిదా బేగం అంగన్‌వాడీ టీచర్లు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మల్దకల్, గట్టు, అయిజ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బరువు తక్కువగా ఉన్న చిన్నారులను గుర్తించి వారి ఎదుగుదలకు అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు వారు తీసుకుంటున్న ఆరోగ్య జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. అంగన్‌వాడీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె పేర్కొన్నారు. గర్భిణులకు రక్తహీనతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. అలాగే ఎన్నికల నియామావళిని అంగన్‌వాడీ టీచర్లు పాటించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ కమలాదేవి, పోషణ అభియాన్ కళ్యాణ్, సురేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నాగరాణి, బాలమ్మ, తెల్లమ్మ, యామిని, సంధ్య, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన గోదాంల నిర్మాణం

- రైతులకు తప్పని ఇబ్బందులు
- వర్షాలకు తడుస్తున్న ధాన్యం, ఎరువులు



అప్పంపల్లి ప్రాథమిక వ్యవసాయ కేంద్రం వద్ద మధ్యలో నిలిచిన గోదాంల నిర్మాణాలు

చిన్నచింతకుంట: ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తుంది. అందుకు కేంద్రాల వద్ద వసతులు కల్పించేందుకు నిధులు కేటాయిస్తుంది. అందులో భాగంగానే కేంద్రాల వద్ద గోదాంల నిర్మాణం చేపట్టింది. మండలంలోని అప్పంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రానికి 1,500 మెట్రిక్ టన్నుల గోదాంల నిర్మాణానికి 2021లో నాబార్డు ద్వారా రూ.90 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. వీటితో అప్పంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం వద్ద 750 మెట్రిక్ టన్నులు, ఉంద్యాలలో 750 మెట్రిక్ టన్నుల గోదాంల నిర్మాణానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అందుకు మే 25న ప్రజాప్రతినిధులు భూమిపూజ చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడంలేదు. అప్పంపల్లిలో మాత్రం పనులు ప్రారంభించి బేస్‌మెంట్ వరకు నిర్మించి వదిలేశారు. ఉంద్యాలలో నేటికి ప్రారంభం కాలేదు.

కల్లాల్లోనే ఉంచాల్సిన పరిస్థితి

అప్పంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో మండలంలోని 16 గ్రామాలలో 5,500 మంది రైతులు ఉన్నారు. కేంద్రం వద్ద సరైన గోదాములు లేక ఎరువులు, ధాన్యాన్ని అధికారులు నిల్వ చేసుకోలేకపోతున్నారు. శిథిలావస్థలో ఉన్న గదుల్లో ఎరువులు ఉంచడంతో వర్షాలకు పూర్తిగా తడుస్తున్నాయి. తడిసిన ఎరువులను రైతులు కొనుగోలు చేసి పంట పొలాలకు చల్లుకోవడంతో సరైన పంట రాక నష్టాల పాలవుతున్నారు. రైతులు పండించిన పంటలు నిల్వ చేసుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. అధికారులు ధాన్యాన్ని కొనుగోలు చేసిన వాటిని తరలించేందుకు ట్రాన్స్‌పోర్ట్ కొరతతో నెలల కొద్ది కల్లాల్లోనే ఉంచుతున్నారు. భద్రపరుచుకునేందుకు కనీసం సంఘం ద్వారా కవర్లను కూడా అందించడంలేదు. వర్షాలకు ధాన్యం తడిసి మొలకలు వచ్చిన ఘటనలు ఉన్నాయి.

ధాన్యం నిల్వకు ఇబ్బందులు



పంటలు నిల్వ చేసుకునేందుకు ఇబ్బందులు ఉన్నాయి. ప్రతి సంవత్సరం వరి ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేస్తున్నారు. వాటిని తరలించే విషయంలో ట్రాన్స్‌పోర్ట్ కొరత ఉందంటూ కల్లాల్లో నెలలకొద్ది నిల్వ ఉంచుతారు. వాటి భద్రత విషయంలో రైతులపైనే ఉంటుంది. వర్షాలకు తడిసి మొలకలు వస్తే రైతులదే బాధ్యత అంటారు. అధికారులు ఈ వర్షాకాలం పంట ధాన్యం కొనుగోలు చేసే వరకు అయినా గోదాములను నిర్మిస్తే బాగుంటుంది.

– రాఘవరెడ్డి, రైతు, అప్పంపల్లి

త్వరగా పూర్తి చేయాలి



అప్పంపల్లి సహకార సంఘం కేంద్రం వద్ద గోదాంల నిర్మాణానికి గతేడాది నిధులు మంజూరయ్యాయి. నిధులతో అధికారులు పనులు చేపట్టి మధ్యలో వదిలేశారు. రైతులకు అందించే ఎరువులు, పండించిన ధాన్యం భద్రపరచడంలో ఇబ్బందులు తప్పడం లేదు.

– శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్, అప్పంపల్లి

నిర్మాణాలు పూర్తి చేయిస్తాం

వర్షాల కారణంగా గోదాంల నిర్మాణం పనులు నిలిచిపోయాయి. త్వరలోనే పనులను ప్రారంభించి నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం.

– గోవిందరాజులు, ప్రాథమిక వ్యవసాయ సంఘం, సీఈఓ

క్లుప్తంగా...

ఏపీలో టెక్ మహీంద్రా స్టార్ హోటల్స్

- విశాఖ సహా 3 ప్రాంతాల్లో ఏర్పాటు
- ఫైవ్ స్టార్, సెవెన్ స్టార్ హోటల్స్ నిర్మాణం
- సీఎం జగన్‌ను కలిసిన టెక్ మహీంద్రా సీఈవో సీపీ గుర్నాని



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విశాఖపట్నం సహా మూడు ప్రాంతాల్లో ఫైవ్ స్టార్, సెవెన్ స్టార్ హోటల్స్ నిర్మించేందుకు మహీంద్రా హాలిడేస్ చైర్మన్, టెక్ మహీంద్రా ఎండీ, సీఈవో సీపీ గుర్నాని సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆయన గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్టార్ హోటల్స్ ఏర్పాటు గురించి సీఎం జగన్‌కు ఆయన వివరించారు. ఒక్కో హోటల్ నిర్మాణానికి రూ.250 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా పర్యాటక రంగం అభివృద్ధికి తాము తీసుకుంటున్న చర్యలు, ప్రోత్సాహకాల గురించి సీఎం జగన్ వివరించారు. విశాఖ సహా 3 పర్యాటక ప్రాంతాల్లో స్టార్ హోటల్స్ నిర్మాణం చేపట్టనున్నామని.. వచ్చే 2 నెలల్లో శంకుస్థాపన చేవడతామని మహీంద్రా ప్రతినిధులు వెల్లడించారు.

చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై విచారణ 17కి వాయిదా

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తనకు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరిస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తదుపరి విచారణను 17కి వాయిదా వేసింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని సీఐడీని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేశ్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి ప్రస్తుతం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ హైకోర్టులో బుధవారం పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు వచ్చింది.

ఇలాగైతే ఎలా?

▶ మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేస్తున్నారు. బదిలీకి తోడుగా శాసనసభ ఎన్నికల విధుల్లో వారి సేవలను వినియోగించరాదని ఈసీ ఆదేశించడం పట్ల మరికొందరు తీవ్రంగా నొచ్చుకున్నారు. ఈసీ విధించే ఇలాంటి ఆంక్షలు కెరీర్‌లో రిమార్కుగా ఉండిపోనుండడమే ఇందుకు కారణం.

బదిలీకి ఇతర కారణాలు సైతం..

కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర పర్యటనకు మూడు రోజుల ముందే వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తాను ఆ శాఖ పనితీరుకు ఎలా బాధ్యురాలిని ? అని బదిలీకి గురైన టీకే శ్రీదేవి 'ఎక్స్'(పూర్వం ట్విటర్) వేదికగా తన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శిగా ఉంటూనే వాణిజ్య శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతల్లో ఆమె కొనసాగడం పట్ల మాత్రమే ఈసీ అభ్యంతరం తెలిపినట్లు తెలిసింది. బదిలీ చేసిన 20 మంది అధికారుల్లో 18 మందిని శాసనసభ ఎన్నికల విధుల్లో ఉపయోగించరాదని ఈసీ ఆదేశించగా, ఆమెతో పాటు బదిలీకి గురైన ఆబ్కారీ శాఖ డైరెక్టర్ ముషర్రఫ్ ఫారూఖీకి ఈ విషయంలో అలాంటి ఆంక్షలు విధించలేదు. ఎన్నికల నిర్వహణలో వాణిజ్య పన్నుల శాఖ కీలక పాత్ర పోషించాల్సి ఉండగా, ఆ శాఖ కమిషనర్‌గా పూర్తి స్థాయి అధికారిని నియమించాలని ఈసీ ఆదేశించినట్టు తెలిసింది. ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతల నుంచి సీఎస్ శాంతికుమారిని తప్పించిన ఈసీ, ఎన్నికల నిర్వహణలో కీలకమైన ఆ శాఖలకు సైతం పూర్తి స్థాయి అధికారులను కార్యదర్శులుగా నియమించాలని కోరింది.

ఈసీకి చేరిన కొత్త పేర్లు ..

ఎక్సైజ్, ఆబ్కారీ శాఖలకు కొత్త ముఖ్యకార్యదర్శులతో పాటు బదిలీకి గురైన ఇతర 20 మంది అధికారుల స్థానంలో కొత్త అధికారులను నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈసీ ఆదేశాల మేరకు ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున అధికారుల పేర్లను ప్రతిపాదిస్తూ గురువారం సాయంత్రం 5గంటల్లోగా ఈసీకి నివేదిక సమర్పించింది. ఆయా అధికారుల వార్షిక పనితీరు నివేదిక(ఏపీఏఆర్)లు, విజిలెన్స్ క్లియరెన్స్‌లను సైతం పంపించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పేర్లను పరిశీలించి ఆయా పోస్టుల్లో ఎవరిని నియమించాలో ఈసీ నిర్ణయం తీసుకోనుంది. హైదరాబాద్ పోలీసు కమిషనర్ పోస్టుకు సీనియారిటీ ప్రకారం డీజీ జితేందర్, అదనపు డీజీలు కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, సందీప్ సాండిల్య పేర్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇక మిగిలిన రెండు పోలీసు కమిషనరేట్లకు చెరో ముగ్గురు ఐపీఎస్ అధికారుల పేర్లతో పాటు బదిలీకి గురైన 10 జిల్లాల ఎస్పీల స్థానంలో 30 మంది ఐపీఎస్ అధికారులు, నాన్‌కేడర్ ఎస్పీల పేర్లను ప్రతిపాదించినట్టు సమాచారం. శని, ఆదివారాల్లో వరుస సెలవులు రావడంతో సోమవారంలోగా ఈసీ నుంచి నిర్ణయం వచ్చే అవకాశాలున్నాయి.



ఫైబర్‌నెట్ కేసులో చంద్రబాబుకు ఎదురుదెబ్బ

▶ మొదటి పేజీ తరువాయి

పీటీ వారంట్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సీఐడీ న్యాయవాదులు.. చంద్రబాబు ప్రధాన కుట్రదారుగా ఈ కుంభకోణానికి పాల్పడ్డారని వివరించారు. పూర్తి ఆధారాలు సేకరించిన అనంతరమే ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని చెప్పారు. సీఐడీ న్యాయవాదుల వాదనలతో సంతృప్తి చెందిన న్యాయస్థానం చంద్రబాబుపై పీటీ వారంట్‌ను అనుమతిస్తూ గురువారం ఆదేశాలు జారీచేసింది. ఆ సమయంలో చంద్రబాబు న్యాయవాదులు అభ్యంతరం తెలిపారు. ఈ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లపై శుక్రవారం సుప్రీంకోర్టు విచారించనుందని చెప్పారు. అందుకే చంద్రబాబును సోమవారం న్యాయస్థానంలో హాజరుపరచాలని ఆదేశించినట్టు న్యాయాధికారి తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటలలోపు చంద్రబాబును విజయవాడ న్యాయస్థానంలో హాజరుపరచాలని ఆదేశించారు. సుప్రీంకోర్టు శుక్రవారం నిర్ణయానికి లోబడే తమ తీర్పు ఉంటుందని చెప్పారు.

ప్రత్యేక పీపీపై దాడికి యత్నించిన టీడీపీ న్యాయవాదులు

ఫైబర్‌నెట్ కుంభకోణంలో చంద్రబాబుపై పీటీ వారంట్‌కు అనుమతించడంతో చంద్రబాబు న్యాయవాదులు తీవ్ర అసహనానికి లోనయ్యారు. దాంతో వారు దాఖలు చేసిన కాల్ రికార్డ్స్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సీఐడీ న్యాయవాదిగా ఉన్న ప్రత్యేక పీపీ వివేకానందపై ఒకదశలో దాడికి తెగబడటం న్యాయస్థానాన్ని విస్మయానికి గురిచేసింది. ఒకనొక దశలో తీవ్ర వాగ్వాదంతో న్యాయస్థానం దద్దరిల్లింది. టీడీపీ న్యాయవాదుల వైఖరితో న్యాయాధికారి నిశ్చేష్టురాలయ్యారు. తీవ్ర సంచలనం సృష్టించిన ఈ ఉదంతానికి సంబంధించిన వివరాలు.. స్కిల్ డెవలప్‌మెంట్ కేసు విచారిస్తున్న, చంద్రబాబును అరెస్ట్ చేసిన సీఐడీ అధికారుల కాల్ రికార్డులను భద్రపరిచేలా ఆదేశించాలని కోరుతూ టీడీపీ న్యాయవాదులు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ సీఐడీ తరఫున ప్రత్యేక పీపీ వివేకానంద వాదనలు వినిపించారు. సీఐడీ అధికారులు తమ విధులను నిర్వర్తిస్తున్నారని చెప్పారు. ఆ విధి నిర్వహణలో భాగంగానే కేసు దర్యాప్తు చేయడంతోపాటు పూర్తి ఆధారాలతో చంద్రబాబును అరెస్ట్ చేశారన్నారు. ఆయన అరెస్ట్ సక్రమమని గుర్తించే న్యాయస్థానం రిమాండ్ విధించిందని గుర్తుచేశారు. కానీ కేవలం రాజకీయ దురుద్దేశంతో సీఐడీ అధికారుల కాల్ రికార్డులు భద్రపరచాలని టీడీపీ కోరుతోందన్నారు. అలా చేయడం సీఐడీ అధికారుల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగకరమని న్యాయస్థానానికి నివేదించారు. గతంలో కొన్ని న్యాయస్థానాలు ఇచ్చిన ఇటువంటి ఆదేశాలను సుప్రీంకోర్టు కొట్టేసిన విషయాన్ని కూడా న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. వివేకానంద వాదనలపై టీడీపీ న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం కలకలం సృష్టించింది. పిటిషన్ వేసి ఇప్పటికే నెల రోజులైందని టీడీపీ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాసరావు అన్నారు. అసలు పిటిషన్‌కే అర్హత లేదని ప్రత్యేక పీపీ వివేకానంద బదులిచ్చారు. దీంతో అక్కడే ఉన్న టీడీపీ న్యాయవాది లక్ష్మీనారాయణ ఒక్కసారిగా ప్రత్యేక పీపీ వివేకానందపైకి దూసుకెళ్లారు. సీఐడీ తరఫున లీగల్ సబ్మిషన్లు చెబుతున్న ఆయనపైకి దూసుకెళ్లి అత్యుత్సాహంతో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేసినవారికి బెయిల్ ఇస్తారని ఈ కేసుతో సంబంధంలేని అంశాలపై తీవ్ర వ్యాఖ్యలు చేయడంతో అందరూ ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. ఈ కేసులో మీరు ఎందుకు ఇలా చేస్తున్నారని లక్ష్మీనారాయణను న్యాయాధికారి ఆగ్రహంగా ప్రశ్నించారు. లక్ష్మీనారాయణ తీరుపై వివేకానంద కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరుపక్షాల న్యాయవాదుల వాగ్వాదంతో న్యాయస్థానం కాసేపు దద్దరిల్లింది. న్యాయస్థానంలో అతిగా ప్రవర్తిస్తున్న వారి పేర్లను నమోదు చేయాలని న్యాయాధికారి ఆదేశించారు. న్యాయవాదులు లక్ష్మీనారాయణ, నాగరాజు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్స్‌లో ఉన్నారా అని న్యాయాధికారి ప్రశ్నించారు. వారిద్దరూ ఆ జాబితాలో లేరని చంద్రబాబు న్యాయవాదులు సమాధానం చెప్పారు. అడ్వకేట్స్ ఆన్ రికార్డ్‌లో ఉన్నవాళ్లు తప్ప అందరూ బయటకు వెళ్లాలని ఆదేశించిన జడ్జి.. ఈ విధంగా ఉంటే తాను ఈ కేసు విచారించాలేనని పేర్కొంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ బెంచ్‌దిగి వెళ్లిపోయారు.

ఆకస్మిక బదిలీలపై ఈసీ ఆరా!

- జిల్లాల వారీగా వివరాలు సేకరిస్తున్న ఈసీ బృందాలు
- ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు భిన్నంగా కొన్ని
- ప్రధానంగా డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్ స్థాయిల్లోనే ఇలా

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సంఘం మార్గదర్శకాల పేరిట రాష్ట్రంలో చోటు చేసు కున్న ఆకస్మిక బదిలీలపై సీఈసీ ఆరా తీస్తోంది. మునుపెన్నడూ లేని విధంగా పోలీసు విభాగంలో బుధవారం జరిగిన బదిలీలను నిశితంగా పరిశీలి స్తోంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలనేపథ్యంలో ఈ ఏడాది జూన్ నెల నుంచే కేంద్ర ఎన్ని కల సంఘం చర్యలకు ఉపక్రమించింది. కీలకమైన పోలీసు, రెవెన్యూ విభాగాల్లో బదిలీలపై దృష్టి పెట్టింది. దీనికోసం జూన్ 2న మెమో నెం.437/ 6/1/ ఐఎస్ఎస్‌టీ/ ఈసీఐ/ ఎఫ్‌యూఎన్‌సీటీ/ ఎంసీసీ/2023) జారీ చేసింది. ఇందులో ఆయా బదిలీలకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. క్షేత్రస్థాయి లో విధులు నిర్వర్తించే ఫోకల్ విభాగం అధికారి ఒకే పోస్టులో, ఒకే రెవెన్యూ జిల్లా లో మూడేళ్ళ పాటు పని చేస్తే బదిలీ చేయాలని స్పష్టం చేసింది. అలాగే సొంత రెవెన్యూ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న, గత ఎన్ని కల సమయంలో వివాదా స్పదమైన, కేసులు నమోదైన అధికారులను బదిలీ చేయాలని ఆదేశించింది. ఈ ప్రక్రియను జూలై 31 నాటికే పూర్తి చేయాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

జిల్లాల వారీగా పరిశీలన

గత జూలై నుంచి పట్టించుకోకుండా యుద్ధప్రాతిపదికన ఇప్పుడు అర్ధాంతరంగా జరిగిన బదిలీలను ఈసీ పరిశీలిస్తోంది. అస్మదీయ అధికారులను కోరిన చోటకు బదిలీ చేయించుకున్నారన్న వాదనలున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు ఇచ్చే సిఫార్సు లేఖలు, పైరవీలకే పెద్ద పీట వేశారన్న విమర్శలూ లేకపోలేదు. వీట న్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం స్థానిక పరిస్థితులను నిశితంగా గమనిస్తోంది. ప్రత్యేక బృందాలతో జిల్లాల వారీగా అధ్యయనం చేయిస్తోంది.

అక్కడ మార్గదర్శకాలకు విరుద్ధంగా బదిలీలు

ఇక వివిధ జిల్లాల్లో, ఈసీ మార్గదర్శకాలకు విరుద్ధంగా, స్థానిక నేతలు, సానుకూలత కారణాలతో జరిగిన బదిలీలు వివాదాస్పదంగానూ మారాయి. ప్రధానంగా మల్కాజ్‌గిరి, కుషాయిగూడ, స్టేషన్ ఘన్‌పూర్, గోషామహల్, ఇబ్రహీంపట్నం, సంగారెడ్డి, కోదాడ, నిర్మల్, గద్వాల్, చేవెళ్ళల్లోని అనేక డీఎస్పీ/ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల ట్రాన్స్‌ఫర్లు ఈసీ దృష్టిలో ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడ పని చేసిన అధికారులు, బదిలీలకు కారణాలు, ప్రస్తుతం పని చేస్తున్న వారి నేపథ్యం తదితరాలను ఎన్నికల సంఘం లోతుగా ఆరా తీస్తున్నట్లు సమాచారం. వీటిపై ఓ స్పష్టత వచ్చిన తర్వాత త్వరలోనే అనేక కీలక పోస్టుల్లో మార్పులు చేర్పులు ఉంటాయని అంటున్నారు.

అంచనాలు సిద్ధం చేసి ఈసీకి పంపండి..

సాక్షి, హైదరాబాద్: రామంతాపూర్ పెద్ద చెరువు చుట్టూ కంచె ఏర్పాటు, ఎఫ్‌టీఎల్ నిర్ధారణ, నీటి పరిశుభ్రత.. తదితర అంశాలకు సంబంధించి అంచనాలు రూపొందించి ఎన్నికల కమిషన్‌కు పంపాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ పనుల పురోగతిపై తదుపరి విచారణ రోజున స్థాయీ నివేదిక ఇవ్వాలని స్పష్టం చేసింది. హైదరాబాద్‌లో 532 చెరువులు క్షీణిస్తున్నాయని. 26 ఎకరాల్లోని రామంతాపూర్ పెద్దచెరువును డంపింగ్ యార్డుగా మారుస్తున్నారని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కేఎల్ వ్యాస్ 2005లో రాసిన లేఖను హైకోర్టు విచారణకు స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో జీహెచ్ఎంసీ కమిషనర్ విచార ణకు హాజరుకావాలని హైకోర్టు ఆదేశించగా, రోనాల్డ్ రోస్ గురువారం కోర్టుకు హాజరయ్యారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా చెరువు ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్) పరిమితుల నిర్ధారణకు సంబంధించి అక్టోబర్ 11 నాటి ప్రిలిమినరీ నోటిఫికేషన్ కాపీని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ తరఫు న్యాయవాది ధర్మాసనానికి సమర్పించారు. 30 రోజుల్లోగా తుది నోటిఫికేషన్ జారీ చేస్తామని చెప్పారు. వీలైనంత త్వరగా ఈసీ నుంచి అనుమతి తీసుకుని పని ప్రారంభిస్తామని, రెండు నెలల్లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ధర్మాస నం విచారణను డిసెంబర్ 28కి వాయిదా వేసింది.

బాబు ముఖం చూస్తే స్కామ్‌లు గుర్తొస్తాయి

- ఆయన ఎప్పుడైనా వరుసగా ఒక నెల రోజులు రాష్ట్రంలో ఉన్నాడా?: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- 35 ఏళ్లు కుప్పం ఎమ్మెల్యేగా ఉంటూ పేదవాడికి ఒక్క ఇల్లూ కట్టలేదు
- బాబు దత్తపుత్రుడి ఇల్లు హైదరాబాద్‌లో ఉంటుంది
- ఆ ఇంటిలో ఇల్లాలు మాత్రం ప్రతి 3, 4ఏళ్లకు మారిపోతోంది
- ఒకసారి లోకల్, మరోసారి నేషనల్, తరువాత ఇంటర్నేషనల్.. ఈసారి ఎక్కడికి?..

మరిన్ని వివరాలు, ఏపీ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకే యాత్ర



పాన్‌గల్ మండలం దావాజిపల్లిలో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

వనపర్తిటౌన్/పాన్‌గల్: ఎస్సీ వర్గీకరణ సాధనకు కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకే మహాపాదయాత్ర చేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల విశ్వరూప మహాపాదయాత్ర ఆరవ రోజు గురువారం వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం మల్లాయిపల్లి, దొండాయిపల్లి, దావాజిపల్లి మీదుగా కొనసాగగా ఆయా గ్రామాల ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం మాదిగలు 30 ఏళ్లుగా రాజీలేని పోరాటం చేస్తున్నారన్నారు. వర్గీకరణ అయితేనే మాదిగ, ఉప కులాలకు భవిష్యత్ బాగుంటుందన్నారు. పార్లమెంటులో బిల్లు పెట్టాల్సింది, ఏది చేయాలన్న కేంద్ర ప్రభుత్వమే కావున కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నదే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశం అన్నారు. వర్గీకరణ కానంత వరకు అన్ని రంగా ల్లో వెనుక్కి పోతూనే ఉంటారన్నారు. రాజకీయాలకు, సంఘాలకు అతీతంగా భవిష్యత్ కోసం ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో శివ, నరేందర్, లక్ష్మయ్య, వంగలి నాగరాజు, నర్సింహ, సీహెచ్ రామస్వామి, ప్రేమ్‌సాగర్, బిచ్చమ్మ పాల్గొన్నారు.

వనపర్తి జిల్లా కేంద్రంలోకి..

మాదిగల విశ్వరూప పాదయాత్ర గురువారం వనపర్తి జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా పాదయాత్రలో భాగంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాదిగలకు ఒక్క మంత్రి పది ఇవ్వకపోవడం ఏంటని, ఎస్సీ వర్గీకరణ కోసం కేసీఆర్ వైఖరి ఎటు తేల్చడం లేదని దుయ్యబట్టారు. ఒక శాతం ఉన్న వెలమలకు నాలుగు మంత్రి పదవులు దక్కితే, 12 శాతం ఉన్న మాదిగలకు మొండిచెయ్యి చూపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడు శాతం ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి ఏడు మంత్రి పదవులా? అని ప్రశ్నించారు. అనంతరం పట్టణంలోని పుర వీధుల గుండా పాద యాత్ర కొనసాగింది.

ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డికి టికెట్ అడిగే అర్హత లేదు

- మీ ఆరాటం పదవుల కోసమే ప్రజల కోసం కాదు
- వీళ్లు పార్టీ మారరని గ్యారంటీ ఎవరిస్తరు: మాజీ మంత్రి నాగం



మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డికి కాంగ్రెస్ టికెట్ అడిగే అర్హత ఎక్కడిదని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి ప్రశ్నించారు. ఆయన ఇంకా ఆ పార్టీలోనే కొనసాగుతున్నారని చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి బాజాప్తా కాంగ్రెస్ కండువా కప్పుకుని ఆ పార్టీ నుంచి టికెట్ అడుగుతున్నారని, కానీ దామోదర్‌రెడ్డి మాత్రం ఇంకా బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారని అన్నారు. ఎన్నికల్లో మళ్లీ తాను, ఆయన కొడుకు ఓడిపోతే ఎమ్మెల్సీ పదవి అయినా మిగులుతుందనేదే కూచుకుళ్ల ఉద్దేశమని చెప్పారు. 'కాంగ్రెస్ అధిష్టానం పాపులారిటీ సర్వే చేశామని చెప్తోంది. తెలంగాణ, ఏపీలో వారికి నాకంటే ఎక్కువ పాపులారిటీ ఉందా? గత ఐదేళ్లుగా కాంగ్రెస్ జెండాను మోసి, కార్యకర్తలతో భుజం కలిపాను. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ఐదు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నుంచి ఒక్క అభ్యర్థి కూడా లేరా? కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి వచ్చి చీల్చింది బీఆర్ఎస్ నా, కాంగ్రెస్ నా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు ఇస్తుందని, కూచుకుళ్ల కుటుంబం కాంగ్రెస్‌లోనే ఉంటారని ఎవరు గ్యారెంటీ ఇస్తారో చెప్పాలన్నారు.

నాగర్‌కర్నూల్ నాగం అడ్డా

కందనూలు: నాగర్‌కర్నూల్ నాగం అడ్డా..నాకు రాజకీయ జీవితం ఇచ్చింది ఈ గడ్డనే, మరోసారి ఇక్కడి నుంచే అసెంబ్లీకి పోటీ చేసి రాష్ట్రస్థాయిలో నాగర్‌కర్నూల్‌ను అభివృద్ధి చేస్తానని నాగం జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. త్వరలో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తానని చెప్పారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని మరోసారి స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాగం శశిధర్‌రెడ్డి, అర్జునరవి, బాలాగౌడ్, నారాయణగౌడ్, పాండు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ నన్ను పిలిచారు..

'2014 ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ నన్ను పిలిచారు. ఏడున్నర గంటలు మాట్లాడిండు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్తా.. పార్టీని నడుపమన్నడు. కానీ నేను ఒప్పుకోలేదు' అని నాగం చెప్పారు. పదవుల కోసమైతే ఇన్నాళ్లు రాకపోయేదా? అని ప్రశ్నించారు. పార్టీ కార్యకర్తల నిర్ణయం కోసం ఈ సారి ఎన్నికల్లో తాను బరిలో ఉంటానని స్పష్టం చేశారు.


జూరాలకు కొనసాగుతున్న వరద

గద్వాల రూరల్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వరద కొనసాగుతోంది. గురువారం రాత్రి 7గంటల వరకు 2,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైనట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 117, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, కోయిల్‌సాగర్‌కు 315, ఎడమ కాల్వకు 1,250, కుడి కాల్వకు 731, సమాంతర కాల్వకు 1000, భీమా లిఫ్ట్-2కు 750తో కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 4,163 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్రీశైలంలో 850.1అడుగుల నీటిమట్టం..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో గురువారం 850.1 అడుగుల వద్ద 80.1 టీఎంసీల నీటి నిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 6,357 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 3,500, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,590, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,231 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 9.577 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 19,480 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. జలాశయంలో 192 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

కల్వకుర్తి అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లోకి..



కల్వకుర్తి రూరల్: అధికారంలో ఉండి నియోజకవర్గం వెనకబడిపోవడాన్ని తట్టుకోలేక ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలనే సంకల్పంతో కాంగ్రెస్ పార్టీలో చేరానని ఎమ్మెల్సీ కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని తోటపల్లిలో ఆయన పర్యటించారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కసిరెడ్డికి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ శ్రీలత అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో తాను శక్తివంచన లేకుండా అభివృద్ధి పనులు చేశానన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం మేరకు ఎమ్మెల్యేలకు కీలక బాధ్యతలు అప్పగించడం వల్ల కల్వకుర్తిని అభివృద్ధి చేయలేకపోయారన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీచేసి అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ మాట్లాడుతూ.. అందరూ పోరాడితేనే తెలంగాణ సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో అశోక్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

50 రోజులు కష్టపడితే విజయం

- కోలార్ ఎంపీ, బీజేపీ జిల్లా ఎన్నికల ఇన్‌చార్జ్ మునిస్వామి



మాట్లాడుతున్న కోలార్ ఎంపీ, బీజేపీ జిల్లా ఎన్నిల ఇన్‌చార్జ్ మునిస్వామి


నారాయణపేట రూరల్/ కోస్గి: రానున్న 50 రోజులు నాయకులు, కార్యకర్తలు కష్టపడితే కమలం గెలుపు ఖాయమని కోలార్ ఎంపీ, జిల్లా ఎన్నికల ఇన్‌చార్జ్ మునిస్వామి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో, కోస్గిలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుటుంబ పార్టీ బీఆర్ఎస్, అవినీతి పార్టీ కాంగ్రెస్‌ను ఓడిం రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు సన్నద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలను మోసం చేయడంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటీ పడుతున్నాయన్నారు. పథకాల అమలు చేయకుండా హామీలు నేరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్, కర్ణాటకలో గ్యారంటీలు అమలులో తోకముడిచిన అవినీతి కాంగ్రెస్ ఇక్కడ గ్యారంటీలు ప్రకటిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు. ప్రాజెక్టుల పేరుతో రూ.వేల కోట్ల ప్రజాధానాన్ని ప్రకటన పేరుతో దుర్వినియోగం చేసి మోసం చేసిందన్నారు. పైగా ఎమ్మెల్యేలు నీళ్లు వచ్చే అంటూ చెరువులను పర్యటిస్తూ పచ్చి మోసం చేస్తున్నారన్నారు. నారాయణపేట జిల్లాకు పాలమూరు ప్రాజెక్టు ద్వారా తీవ్ర అన్యాయం చేసిందన్నారు.

కేంద్ర చేసిన అభివృద్ధిని వివరించండి..

కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన నిధులు, సంక్షేమం, ఇతర అభివృద్ధి గురించి వివరిస్తూ ఓట్లు అడగాలని సూచించారు. డబుల్ ఇంజన్ సర్కారు వల్ల జరిగే ప్రయోజనాలు వివరించాలని సూచించారు. అలాగే, అధికారంలోకి వస్తాం జూరాల ద్వారా నీటిని తీసుకొని జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించి తీరుతామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ మోసాలను ప్రజలు భరించే స్థితిలో లేరని ప్రజలు ప్రత్యామ్నాయం కోరుకుంటున్నారని అందుకు కార్యకర్తలు అనునిత్యం ప్రజల్లో ఉండి జాగృతం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర నాయకులు నాగూరావు నామాజీ, కె.రతంగ్‌పాండురెడ్డి, దళితమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడ సత్యయాదవ్, రఘురామయ్యగౌడ్, జీకే నర్సింహులు, శ్రీనివాస్, కూరవెంకటయ్య, నర్సిములు, రాము, రమేష్, పాల్గొన్నారు.

శిథిలావస్థలో చారిత్రక కట్టడాలు

నర్వ: కాకతీయుల కాలం నాటి చారిత్రక కట్టడాలు ప్రస్తుతం కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని పెద్దకడ్మూర్‌లో కాకతీయుల కాలం నాటి బాలబ్రహ్మేశ్వర ఆలయం ఎదుట ఉన్న కోట బుర్జు మట్టి కొన్ని రోజులుగా కూలుతుంది. రహదారి పక్కనే ఉండడంతో ప్రమాదకరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచిన ఈ కట్టడాలను పురావస్తు శాఖ పరిశీలించి మరమ్మతు చేపడితే రాబోయే తరాలకు సాక్ష్యంగా నిలుస్తాయని అంటున్నారు.



పెద్దకడ్మూర్‌లోని కాకతీయుల కాలం నాటి కోట బుర్జు

వైద్య వృత్తి పవిత్రమైంది



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంబీబీఎస్ ప్రథమసంవత్సరం విద్యార్థులు

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. సునందిని

వనపర్తి: ప్రాణాలు కాపాడే వైద్య వృత్తి చాలా పవిత్రమైందని వనపర్తి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. సునందిని అన్నారు. గురువారం 2023–24 విద్యాసంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులు కళాశాలలో చేరడంతో నిర్వహించిన 'వైట్‌కోట్ సెర్మాని' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైట్‌కోట్ ప్రాముఖ్యతను వివరించటంతో పాటు ప్రజారోగ్యమే ధ్యేయంగా వైద్యవృత్తిని అంకితభావంతో నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్లు, జూనియర్లు అంటూ ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రయోగశాల, గ్రంథాలయం తదితర సౌకర్యాలు కల్పించామని.. ఐదేళ్ల పాటు ఇక్కడే ఉండి ఎంబీబీఎస్ పూర్తి చేయాలని సూచించారు. అతి త్వరలో శాశ్వత కళాశాల భవన నిర్మాణం పూర్తికానున్నట్లు చెప్పారు.